
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
3
గురువారం 11 జూలై 2024
జిల్లాల వార్తలు



మెదక్ ఎస్పీగా ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్ అర్బన్, జూలై 10 : మెదక్ జిల్లా ఎస్పీగా ఉదయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఆయన మెదక్ వచ్చారు. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న డాక్టర్ బి.బాలస్వామిని ఈస్ట్ జోన్ డీసీపీగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీగా ఈ ఏడాది జనవరి 6న బాధ్యతలు స్వీకరించిన ఆయన ఏడు నెలల పాటు జిల్లాలో పనిచేశారు.

కెనాల్‌కు భూములు ఇవ్వం

సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్న చిన్నచింతకుంట రైతులు

నర్సాపూర్, జూలై 10 : 'తరతరాలుగా భూమిని నమ్ముకుని మా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి ఇప్పుడు సంగారెడ్డి కెనాల్ కోసం భూములు ఇవ్వమంటే ఎలా? మేము వాటిని ఎట్టి పరిస్థితిలో ఇవ్వబోం' అని మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామ రైతులు తేల్చిచెప్పారు. బుధవారం సర్వే కోసం గ్రామానికి వచ్చిన అధికారులను అడ్డుకుని తిప్పి పంపించి వేశారు. సంగారెడ్డి కెనాల్ కోసం రెవెన్యూ, ఇరిగేషన్, అటవీశాఖ అధికారుల బృందం బుధవారం చిన్నచింతకుంట గ్రామానికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న రైతులు అధికారులు సర్వే చేయడానికి వచ్చిన చోటుకు వెళ్లి వారితో వాగ్వాదానికి దిగారు. సర్వే చేయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చిన్నచింతకుంట గ్రామానికి చెందిన సుమారు 40 ఎకరాల భూమిని సంగారెడ్డి కెనాల్ కోసం తీసుకోవడానికి అధికారులు చూస్తున్నారని, ఈ భూములను నమ్ముకుని తమ కుటుంబాలు బతుకుతున్నాయని వాటిని తీసుకుంటే మేమెలా బతకాలని ప్రశ్నించారు. ఎకరా రూ.కోటి వరకు పలికే ఈ భూములకు పరిహారం రూ.పది లక్షలు కూడా రాదని దాంతో ఆ డబ్బుతో ఎట్లా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎట్టి పరిస్థితిలో భూములు ఇవ్వబోమని ఒక వేళ భూములు తప్పనిపరిస్థితులో ఇవ్వాల్సి వస్తే ఎకరాకు రూ.60లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఎటువంటి సర్వే చేసే ప్రసక్తి లేదని మొండికేసి అధికారులను అడ్డుకుని వారి వాహనాలకు అడ్డుగా కూర్చోవడంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు.



సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకుని బైఠాయించిన రైతులు

మృత్యు తీగలు

యమపాశాలవుతున్న కరెంటు వైర్లు



నాగిరెడ్డిగూడెంలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన గేదెలు(ఫైల్)

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన ఏనుగు పెద్ద పద్మారెడ్డి పొలంలో గల విద్యుత్ స్తంభం మధ్యలోకి విరిగింది. ఇనుప చువ్వలు తేలి రెండేళ్లుగా ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు విరిగిపడుతుందోననే భయంతో సంబంధిత అధికారులకు చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదు.

గుమ్మడిదల మండలంలో ఇటీవల ఏర్పాటు చేసిన 55 ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ఏబీ స్విచ్‌లు అమర్చడం లేదని రైతులు ఆగ్రహిస్తున్నారు. స్తంభాలు కిందపడిపోయేలా ఉన్నా పట్టింపు లేదు. వేలాడుతున్న విద్యుత్ తీగలతో నాగిరెడ్డిగూడెం, గుమ్మడిదలలో పశువులు మృతిచెందాయి.

కేవలం శివ్వంపేట, గుమ్మడిదల మండలాల్లోనే కాకుండా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని చాలా చోట్ల ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఓ వైపు మనుషులు, పశువుల ప్రాణాలు పోతున్నా అందుకు తగిన నియంత్రణ చర్యలను చేపట్టడంలో విద్యుత్ శాఖ అధికారుల అలసత్వం కనిపిస్తోంది.



గుమ్మడిదల మండలంలోని రాగిణికుంట సమీపంలో చేతికందేలా ఉన్న విద్యుత్ తీగలు



నాగల్‌గిద్ద శివారులోని రైతు ధన్‌రాజ్ పొలంలో వంగిన విద్యుత్ స్తంభం



జహీరాబాద్-బీదర్ దారిలో నేలకు తాకేలా తీగలు



రాయికోడ్ బస్టాండ్ సమీపంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

- చేతికందేలా వేలాడుతున్న వైనం
- వంగిపోయి కనిపిస్తున్న స్తంభాలు
- ఆరునెలల్లోనే 27 మంది దుర్మరణం
- క్షేత్రస్థాయిలో కానరాని పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 10 : ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రైతులు నిత్యం పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం ఉండనే ఉంటుంది. ఈ క్రమంలో వేలాడే తీగలు, కిందపడే స్తంభాలతో తమ ప్రాణాలకే ముప్పు ఉందని రైతులు వాపోతున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణేది?

మెదక్ జిల్లాలో 1,07,463 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా సంగారెడ్డి జిల్లాలో 1,04,051 కనెక్షన్లు ఉన్నాయి. అత్యవసర విభాగంగా పేర్కొనే విద్యుత్ శాఖలోని సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. అయితే వేసవి, చలికాలంతో పోల్చితే వానాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలు, రక్షణ వ్యవస్థలేని ట్రాన్స్‌ఫార్మర్లపై దృష్టిపెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతేగాకుండా గ్రామీణ స్థాయి దాకా విద్యుత్‌శాఖలో సిబ్బంది పనిచేస్తుంటారు. కానీ లోటుపాట్లు మాత్రం వారి కంటికి కానరావడం లేదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



అందోలు మండలం నేరడిగుంట గ్రామంలో ఓ ఇంటి దాబాపై విద్యుత్ స్తంభం



శివ్వంపేట మండలం నవాబ్‌పేటలో ఓ పొలంలోని స్తంభం

27 మంది ప్రాణాలు హరీ..

గడిచిన ఆరునెలల వ్యవధిలోనే విద్యుత్ ప్రమాదాలు, విద్యుత్ షాక్‌తో 27 మంది చనిపోయారు. సంగారెడ్డి జిల్లాలో 9 మంది మృతిచెందారు. విద్యుత్‌షాక్‌తో 18 మూగజీవాలు మృత్యువాతకు గురయ్యాయి. ఇప్పటివరకు ఆ శాఖ నుంచి ఎలాంటి నష్టపరిహారం కూడా అందలేదు. ఇక మెదక్ జిల్లాలో 18 మంది దుర్మరణం పాలయ్యారు. 14 పశువులు చనిపోయాయి. ఇందులో స్వీయ తప్పిదాలతోపాటు విద్యుత్ శాఖ పొరపాట్లు లేకపోలేదు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటే ఈ స్థాయిలో నష్టం జరిగేది కాదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలపై పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే మరిన్ని ప్రాణాలు గాలిలో కలవక తప్పదు.



టేక్మాల్ మండలం ఎల్లంపల్లిలో తీగలకు ఊతంగా కర్ర



కొండాపూర్ మండలం మల్లేపల్లిలో ఓ విద్యుత్ స్తంభం పరిస్థితి

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

- సంగారెడ్డిలోని శాంతినగర్‌లో ఘటన
- వరుస ఘటనలతో ప్రజలు బెంబేలు

సంగారెడ్డి అర్బన్, జూలై 10 : సంగారెడ్డి పట్టణంలో కుక్కల దాడులు ఆగడం లేదు. రోజూ ఏదో ఒక చోట మనుషులను కరుస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ మధ్యనే స్థానిక మంజీర ఆస్పత్రి సమీపంలోని శ్రీనగర్ కాలనీలో ఆరేళ్ల బాలుడిపై వీధికుక్కలు దాడి చేసిన ఘటన మరవకముందే బుధవారం మరో ఘటనలో నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని శాంతినగర్‌లోని తన ఇంటి వద్ద ఆడుకుంటున్న సందర్భంలో బాలుడు సాధక్‌పై ఒక్కసారిగా వీధి కుక్కలు ఎగబడి కరిచాయి. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన సాధక్‌ను సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. జిల్లా కేంద్రంలో తరచూ చిన్నారులపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నా..కుక్కల బెడద నివారణకు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కుక్కల దాడిలో సాధిక్‌కు అయిన గాయాలు

ఈడీ పేరిట బురిడీ

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

- లక్షలు పోగొట్టుకుంటున్న బాధితులు
- రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాలు
- గతేడాది రూ.22.71 కోట్లు కాజేసిన వైనం



సంగారెడ్డి క్రైం, జూలై 10 : గతంలో సైబర్ నేరగాళ్లు ఆధార్‌కార్డు, ప్యాన్‌కార్డు అప్‌డేట్, అనుసంధానం అంటూ వాటి లింకులను పంపి లేదా ఓటీపీలను చెప్పమని బ్యాంకు ఖాతాలోని డబ్బు కొట్టేసేవారు. ఇటీవల పార్ట్‌టైం జాబ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ అంటూ డబ్బు స్వాహా చేసిన ఘటనలూ వెలుగు చూడగా, తాజాగా సైబర్ కేటుగాళ్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేరు చెప్పి బురిడీ కొట్టించి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో గత సంవత్సరంలో మొత్తం 323 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధితులు రూ.22.71 కోట్లను పోగొట్టుకున్నారు. ఇందులో పోలీసులకు సకాలంలో బాధితులు ఫిర్యాదు చేయగా రూ.3.62 కోట్లు హోల్డ్ చేయడం జరిగింది.

ఉన్నతాధికారికి రూ.5 కోట్లు ఎగనామం

ఇటీవల పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇంటిపై ఈడీ అధికారులు దాడి చేసిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ఆ సంఘటనను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తిని మోసం చేశారు. ఈనెల 6వ తేదీన పటాన్‌చెరులో ఈడీ పేరుతో రూ.3 లక్షల కాజేశారు. పటాన్‌చెరు మండలం లక్డారంకు చెందిన ఓ వ్యక్తికి ఈనెల 1వ తేదీన అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ముంబై ఈడీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని నీపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని బెదిరించి ఆధార్, బ్యాంకు వివరాలు తీసుకున్నాడు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ సైతం చెప్పడంతో బ్యాంకు నుంచి రూ.3లక్షలు పోయినట్టు తర్వాత గుర్తించాడు. అలాగే సంగారెడ్డి సమీపంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న ఉన్నతాధికారి సైతం సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.5కోట్లు బ్యాంకు ఖాతా నుంచి పోగొట్టుకున్నట్టు పోలీసుల వర్గాల ద్వారా తెలిసింది.

బ్యాంకు ఖాతాలో డబ్బు లేకున్నా..

బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఉన్న వారినే కాకుండా లేకున్నా సైబర్ నేరగాళ్లు కొట్టేస్తున్నారు. గుర్తు తెలియని ఓ ఫోన్ నంబర్ ద్వారా వాట్సాప్ గ్రూప్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో యాడ్ చేస్తారు. ఇందులో టాస్కుల పేరిట వర్క్ ఇస్తారు. వాటిని పూర్తి చేసిన తర్వాత డబ్బు పంపడానికి పే యాప్‌ల లింకులు ఇవ్వాలని, లేదా బ్యాంకు అకౌంట్‌ను ఇవ్వాలని కోరుతుంటారు. ముందుగా ఇచ్చిన టాస్క్ పూర్తిచేసిన తర్వాత మీ బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేస్తామని పేరు, వయస్సు, వృత్తి, ఫోన్ నంబరు ఇతర పూర్తి వివరాలు సేకరిస్తారు. నమ్మించడానికి మొదటగా కొంత డబ్బు పంపుతారు. ఆశ పడిన బాధితుల నుంచి విడతల వారీగా బ్యాంకు ఖాతా నుంచి లక్షల్లో డబ్బు సైబర్ నేరగాళ్లు లాగేస్తారు. ఇక ఖాతాల్లో డబ్బు లేకుంటే మరో ప్రణాళికను అమలు చేస్తున్నారు. వివిధ బ్యాంకుల నుంచి పర్సనల్ లోన్లు ఇస్తామంటూ ప్రతి ఒక్కరికీ అనేక ఫోన్ కాల్స్ వస్తున్న విషయం తెలిసిందే. ఇలా కొన్ని బ్యాంకు లోన్ విభాగాలతో సైబర్ నేరగాళ్లు అప్రోచ్ అయి బాధితులకు సంబంధించిన వివరాలు ఇస్తారు. దీంతో బాధితుల బ్యాంకు ఖాతాలకు రుణం ఇప్పిస్తారు. ఈ డబ్బుతో టాస్కులు పూర్తి చేయించి కొద్దికొద్దిగా బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తం డబ్బును కాజేస్తారు.

నాలుగేళ్లలో సైబర్ క్రైమ్ కేసులు	
సంవత్సరం	కేసులు
2021	35
2022	217
2023	323
2024(జూన్ వరకు)	196

వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు



ఇంటర్‌నెట్, స్మార్ట్ మొబైల్ ఫోన్ల వాడకం ఎక్కువైన నేపథ్యంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయి. అక్షరాస్యులే ఎక్కువగా సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారు. అత్యాశకు పోయి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసుకుంటున్నారు. ఎటువంటి సమాచారంతోనైనా ఫోన్లు చేసి భయపెడుతుంటారు. డ్రగ్స్ కేసులో పాత్ర ఉందని, ఈడీ కేసు నమోదైందని భయభ్రాంతులకు గురిచేసే అవకాశం వుంది. మీ వ్యక్తి గత వివరాలు, ఆధార్, ప్యాన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పమంటే.. స్పందించవద్దు. సైబర్ మోసానికి గురైన వారు టోల్ ఫ్రీ నంబరు 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేయాలి. దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

- రూపేష్, ఎస్పీ

వలపు వలలో చిక్కి మరికొందరు

సైబర్ నేరగాళ్లు కొందరు మహిళల ద్వారా పురుషులకు ఫోన్‌కాల్స్ చేయిస్తున్నారు. ముందుగా మహిళ వీడియో కాల్ ద్వారా పరిచయమై సదరు వ్యక్తిని మాటల్లో దింపుతుంది. అలా వీడియో కాల్‌లో తను నగ్నంగా మారి ఎదుటి వారిని కూడా నగ్నంగా మారే విధంగా చేస్తుంది. ఇదంతా అవతలి ఫోన్‌లో రికార్డు చేస్తుంది. తర్వాత ఆ రికార్డింగ్ చేసిన వీడియోను సదరు వ్యక్తికి పంపి డబ్బు కావాలని బెదిరింపులకు పాల్పతుంది. సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్న వ్యక్తులు తమ పరువు పోతుందని బావించి సైబర్ నేరగాళ్లు అడిగినంత డబ్బును వారి ఖాతాల్లోకి పంపుతున్నారు. ఇటువంటి ఘటనలో సైబర్ నేరగాళ్ల వలకు ఉన్నతాదికారులు సైతం చిక్కుకుంటున్నట్టు పోలీసుల విచారణలో తెలుస్తోంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి స్వాహా

సైబర్ నేరగాళ్లు విసురుతున్న సరికొత్త వలలో అనేక మంది ఉద్యోగులు, నిరుద్యోగులు చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ.. పార్ట్‌టైంగా జాబ్ చేస్తూ అదనంగా డబ్బు సంపాదించవచ్చన్న ఆశతో సైబర్ నేరగాళ్ల బారిన పడి లక్షల్లో నష్టపోతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రపురం తదితర పట్టణాల్లోనే అధికంగా మోసపోయిన బాధితులు ఉన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, జులై 10 : తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్-1 (మెయిన్స్) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడి సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 75 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని, గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించిన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో www.tgbcastudycircle.cgg.gov.in ద్వారా ఈ నెల 19వ తేదీ వరకు సమర్పించాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, కోచింగ్ వ్యవధిలో ప్రతీ అభ్యర్థికి నెలకు రూ.5వేల స్టైఫెండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం 08455-2767015, 9949592991 నంబర్లలో సంప్రదించాలని, లేదా నేరుగా బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.

చిరుత కలకలం

ఝాన్సీ లింగాపూర్‌లో దూడను చంపిన వ్యాఘ్రం



చిరుత చంపేసిన దూడను చూపుతున్న రైతు

రామాయంపేట, జూలై 10 : రామాయంపేట మండల పరిధి ఝాన్సీ లింగాపూర్‌లో చిరుత పులి సంచారం కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున గ్రామ శివారులో రైతు ఇప్ప రాజు పశువుల పాకలోని దూడను చంపి తిన్న ఘటన భయాందోళనకు గురిచేసింది. బాధితుడి వివరాల ప్రకారం.. రోజూలాగే మంగళవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో రైతు పశువులను కట్టేయగా.. బుధవారం ఉదయం వెళ్లేసరికి దూడ చనిపోయి ఉంది. దీంతో బాధిత రైతు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఈ ప్రాంతంలో చిరుత సంచారం ఉందని తెలియడంతో లింగాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతంలోనూ చిరుత సంచారంతో ఫారెస్ట్ అధికారులు బోన్లు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతుల్లో తీవ్ర భయాందోళన మొదలైంది. పొలం పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్

● వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ

వెల్దుర్తి, జూలై 10: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ హెచ్చరించారు. బుధవారం వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, ఉప్పులింగాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. అలాగే వెల్దుర్తి ఎంఆర్సీలో ఎంఈవో యాదగిరితో కలిసి మండలంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనుల గురించి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉప్పులింగాపూర్ ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థులకు తక్కువగా హాజరు కావడం జరిగిందని, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి బడికి వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రణాళిక తయారు చేసుకోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాలు వచ్చేవిధంగా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు 90శాతం వరకు పూర్తయ్యాయని, ఇప్పటివరకు పనులకు సంబంధించి 75 శాతం నిధులు విడుదల చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఐదురోజుల్లో పూర్తి చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పనులు పూర్తిగా జరిగిన చోట బిల్లులు వెంటనే చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశామని డీఈవో రాధాకిషన్ తెలిపారు.



అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల గురించి ఎంఈవో యాదగిరిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో రాధాకిషన్

నగదు ప్రోత్సాహకాలు అందజేత

వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు వెల్దుర్తి పట్టణానికి చెందిన నరేందర్ తన తండ్రి జ్ఞాపకార్థం నగదును అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, వెల్దుర్తి ఎంఈవో యాదగిరి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైపాస్ నిర్మాణ స్థలాల పరిశీలన

రామాయంపేట, జూలై 10: సిద్దిపేట నూతన బైపాస్ నిర్మాణ స్థలాలను మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. హైవే అథారిటీ అధికారులతో కలిసి జంక్షన్లు, రోడ్డు మార్గం ఎక్కడి నుంచి వెళ్తుందన్న దానిపై వివరాలు సేకరించారు. కొత్త హైవే విస్తరణలో భాగంగా రెండున్నర కిలో మీటర్ల మేర బైపాస్ నిర్మిస్తున్నారు. దీంతో తమ విలువైన భూములు పోతున్నాయంటూ పలువురు రైతులు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు మొరపెట్టుకున్నారు. బైపాస్ వద్దంటూ ఆయనకు విన్నవించారు.

ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో ప్రాధాన్యతనివ్వాలి

● ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, జులై 10: ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో ప్రాధాన్యతనివ్వాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్ ఆదేశాల మేరకు సంగారెడ్డిలో బుధవారం సమావేశం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ముదిరాజ్ విద్యార్థులకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా నాయకులు భూలక్ష్మి, లావణ్య, ప్రియ. డా. శిల్ప, హరీశ్‌కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారం దిశగా కృషి: తహసీల్దార్

జహీరాబాద్, జూలై 10: జహీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధరణికి సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. జహీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 1,200 మంది రైతులు ధరణి సమస్యలు ఉన్నాయమంటూ దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు 1000 మంది రైతుల సమస్యలను పరిష్కరించామన్నారు.





తూప్రాన్ అర్బన్ పీహెచ్‌సీకి కేటాయించిన భూమి, ఆస్పత్రి కోసం కేటాయించిన భూమిలో సర్వే చేస్తున్న అధికారులు

యూపీహెచ్‌సీపై నీలినీడలు

- ఏడాది క్రితం మంజూరు
- అప్పుడే అర్బన్ పీహెచ్‌సీ భూమి కేటాయింపు
- తూప్రాన్ మండల ప్రజలు, గర్భిణుల తీవ్ర అవస్థలు

పేదలకు వైద్యమందించేందుకు మంజూరు చేసిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడాది క్రితమే యూపీహెచ్‌సీ మంజూరైనా ఏర్పాటుకు అధికారులు శ్రద్ధ చూపించడం లేదు. ఫలితంగా పేదలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తూప్రాన్, జూలై 10: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా... గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ సీఎం కేసీఆర్ తూప్రాన్ పట్టణానికి 50 పడకల ఆస్పత్రికి మంజూరు చేశారు. రూ.11 కోట్లతో నిర్మించిన 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 2018 జనవరి 17న కేసీఆర్ ప్రారంభించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పక్కపక్కనే ఉండటం, సీహెచ్‌సీ ఏర్పాటుతో పీహెచ్‌సీకి నిధులు, మందుల కేటాయింపు నిలిపివేశారు. దాంతో నూతనంగా ఏర్పాటుచేసిన మనోహరాబాద్ మండలానికి తూప్రాన్ పీహెచ్‌సీ పంపించాలని అధికారులు నిర్ణయించారు. తూప్రాన్ పీహెచ్‌సీని మనోహరాబాద్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు రావడంతో, 2022 సెప్టెంబరులో పీహెచ్‌సీని అక్కడికి బదిలీ చేశారు. మనోహరాబాద్‌లో ఆస్పత్రి భవన నిర్మాణం కూడా చేపట్టారు. తూప్రాన్ పీహెచ్‌సీని మనోహరాబాద్ మండలానికి బదిలీ చేయడంతో రోగులు, ప్రజలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూప్రాన్ మండలంలో ఘనపూర్, గుండ్రెడ్డిపల్లి, నాగులపల్లి, రావెల్లి, తూప్రాన్-1, తూప్రాన్-2 ఆరు సబ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. తూప్రాన్ మండలంలో పీహెచ్‌సీ లేకపోవడంతో మనోహరాబాద్ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తున్నది. తూప్రాన్ మండలంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు వెళ్లి విధులు చేయాల్సి ఉండగా, గర్భిణులు మనోహరాబాద్ మండల పీహెచ్‌సీకి వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది. ఈ ఇబ్బందులను స్థానిక రాజకీయ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తూప్రాన్ పట్టణానికి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని పలు మార్లు అభ్యర్థించారు. తెలంగాణ వ్యాప్తంగా 24 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేస్తూ 2023 ఆగస్టు 31న ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో తూప్రాన్ పట్టణానికి యూపీహెచ్‌సీతోపాటు మెదక్, జహీరాబాద్, తెల్లాపూర్, సిద్దిపేట, గజ్వేల్ పట్టణాలకు యూపీహెచ్‌సీలను మంజూరు చేశారు. యూపీహెచ్‌సీ ఒక్కొక్క భవన నిర్మాణానికి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.1.43 కోట్లు మంజూరు చేశారు. యూపీహెచ్‌సీ ఏర్పాటుకు భూమి కేటాయించాలని కలెక్టర్‌ను కోరడంతో ఆగమేఘాల మీద భూమి కేటాయింపులు చేపట్టారు. తూప్రాన్ పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సర్వేనంబరు 325లో 0.17 గుంటల భూమి కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ రాజర్షిషా 2023 సెప్టెంబరు 15న ఆదేశాలు జారీచేశారు.

గర్భిణులకు తీవ్ర అవస్థలు



తూప్రాన్‌కు మంజూరైన యూపీహెచ్‌సీ వెంటనే ఏర్పాటు చేయాలి. మల్కాపూర్, కోనాయపల్లి గ్రామాలకు చెందిన గర్భిణులు పరీక్షలకు మనోహరాబాద్ వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు సుమారు 25 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి వెంటనే యూపీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి.

- పంజాల వెంకటమ్మ, తాజా మాజీ ఎంపీటీసీ, మల్కాపూర్

భూమి కేటాయింపు మాత్రమే..

తూప్రాన్ పట్టణానికి యూపీహెచ్‌సీ మంజూరై ఏడాది కావస్తున్నా అడుగు ముందుకు పడడం లేదు. రెవెన్యూ అధికారులు భూమి కేటాయించినప్పటికీ భవన నిర్మాణ పనులేమి జరగడం లేదు. భవన నిర్మాణ పనుల విషయం అటుంచితే, యూపీహెచ్‌సీ ఏర్పాటు చేసి పేదలకు వైద్యం అందజేయడం లేదు. యూపీహెచ్‌సీ ఏర్పాటు చేయకపోవడంతో తూప్రాన్ మండలంలోని మల్కాపూర్, కోనాయపల్లి గ్రామాల రోగులు 25 కిలోమీటర్ల దూరంలో మనోహరాబాద్ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుంది. యూపీహెచ్‌సీ ఏర్పాటు లేకపోవడంతో ఘనపూర్, నాగులపల్లి సబ్‌సెంటర్ల రోగులు మనోహరాబాద్ వెళ్లలేకపోతున్నారు. యూపీహెచ్‌సీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ రాజధాని బస్సులో భారీ చోరీ

● తూప్రాన్ దాబా వద్ద రూ.5 లక్షలు అపహరణ

తూప్రాన్, జూలై 10: ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తున్న వ్యాపారి వద్ద భారీ నగదు చోరీ జరిగింది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో హైవే బైపాస్‌లో దాబా హోటల్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. హైదరాబాద్ కొంపెల్లికి చెందిన అమీన్ అబ్దుల్ లలాని కొద్దిరోజులుగా మసాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. నిజామాబాద్ పట్టణానికి చెందిన ఇమ్రాన్ వద్ద మసాల సరఫరా చేసిన డబ్బులు తీసుకురావడానికి మంగళవారం నిజామాబాద్‌కు వెళ్లాడు. రూ.5 లక్షలు తీసుకొని కాలేజీ బ్యాగ్‌లో పెట్టుకొని నిజామాబాద్ నుంచి కొంపెల్లికి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరాడు. రాత్రి తూప్రాన్ పట్టణ శివారు హైవే బైపాస్‌లోని వినోద్ దాబా హోటల్ వద్ద బస్సు ఆగింది. డబ్బులున్న బ్యాగ్ సీటులో పెట్టి భోజనం చేసేందుకు కిందికి దిగాడు. భోజనం చేసి బస్సులోకి వచ్చి చూడగా రూ.5 లక్షల నగదున్న బ్యాగ్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

ప్రభుత్వ నిషేధిత గుట్కాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను చూపిస్తున్న టూ టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, జూలై 10: సిద్దిపేట టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డులోని ఓ షాపులో ప్రభుత్వం నిషేధించిన వివిధరకాల గుట్కా ప్యాకెట్లు ఉన్నాయని నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు, టూ టౌన్ పోలీసులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో రూ.61,108 వేల విలువచేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్కిట్, కవిత పోటీల విజేతలకు నగదు బహుమతి



విజేతలకు నగదు బహుమతిని అందజేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 10: ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో స్వీప్ ఫ్యూచర్ ఓటర్, యంగ్ ఓటర్స్ పేరిట విద్యార్థులకు స్కిట్ కాంపిటేషన్, కవిత, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన పాఠశాలలకు కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.30 వేల పారితోషికం అందించారు. స్కిట్ పోటీల్లో మొదటి బహుమతిగా తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ హోతి-కె రూ.10 వేలు, రెండో బహుమతిగా జిన్నారం మండలం బొల్లారం జడ్పీ ఉన్నత పాఠశాల రూ.8 వేలు, మూడో బహుమతిగా అందోల్ మండలం కంసాన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల రూ.5 వేలు, అదేవిధంగా పాటలు, కవితల పోటీల్లో మొదటి బహుమతి కింద సదాశివపేట కేజీబీవీ విద్యార్థిని మానస రూ.5 వేలు, రెండో బహుమతిగా తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులు శాంభవి, వైష్ణవి రూ.4 వేలు, మూడో బహుమతిగా బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నీలిమ రూ.3 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. వీరికి బుధవారం డీఈవో వెంకటేశ్వర్లు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.1.25 లక్షల స్టడీ మెటీరియల్స్, మైక్రోస్కోప్ పంపిణీ



వేలూర్, సీతారాంపల్లి పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, మైక్రోస్కోప్ అందజేస్తున్న అట్ల శ్యాంసుందర్‌రెడ్డి దంపతులు

వర్గల్, జూలై 10: వర్గల్ మండలం వేలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతారాంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వేలూర్ గ్రామానికి చెందిన అట్ల శ్యాంసుందర్‌రెడ్డి, కిరణ్మయి దంపతులు కుమారుడు రిషిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రూ.1.25 లక్షల విలువ చేసే స్టడీ మెటీరియల్స్ మైక్రోస్కోప్‌ను బుధవారం అందజేశారు. ఐదేళ్లుగా ప్రతీ సంవత్సరం అట్ల రిషిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలు పాఠశాల్లో చదవుతున్న విద్యార్థులకు స్టడీ మెటిరియల్స్‌ను అందిస్తుండడం చాలా సంతోషంగా ఉన్నదని శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఉమలతాగోవర్ధన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌గుప్తా, విద్యార్థులు పాల్గొన్నారు.

పాదరక్షల టెండర్‌దారుడి అక్రమ వసూలు

● మల్లన్న ఆలయాధికారులకు భక్తుల ఫిర్యాదు

చేర్యాల, జూలై 10: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో పాదరక్షలు భద్రపరిచే టెండర్‌దారుడు టెండర్ నిబంధనలు గాలికి వదిలేసి భక్తుల నుంచి అక్రమ వసూలుకు పాల్పడటంతో పాటు దురుసుగా ప్రవర్తించిన తీరుపట్ల పలువురు భక్తులు ఆలయాధికారులకు ఫిర్యాదు చేశారు. కరీనంగర్ జిల్లాకు చెందిన సుధీర్‌కుమార్, సురేశ్ తదితరులు హైదరాబాద్‌కు చెందిన తమ బంధువులతో కలిసి బుధవారం మల్లన్న దర్శనం కోసం కొమురవెల్లికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో చెప్పుల స్టాండు వద్ద వారి పాదరక్షలు భద్రపరిచారు. టెండర్ నిబంధనల మేరకు ఒక్కో జతకు రూ.5 చొప్పున వసూలు చేయాలి. ఇదే విషయమై టికెట్‌పైనా ముద్రించినప్పటికీ టెండర్‌దారుడు అంకెను దిద్ది రూ.10 చొప్పున డిమాండ్ చేశాడు. అధికంగా డబ్బులు అడగటమేంటని సుధీర్‌కుమార్, సురేశ్ ప్రశ్నించడంతో టెండర్‌దారులు వాగ్వివాదానికి పాల్పడ్డాడు. లక్షలాది రూపాయలు పెట్టి వేలం పొందామని, ఆలయాధికారులే అధికంగా డబ్బులు తీసుకోవాలని తమకు చెప్పారని, ప్రశ్నించడానికి మీరెవరంటూ దురుసుగా మాట్లాడాడు. దీంతో వారు ఈవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్రమ వసూలుకు పాల్పడుతున్నా ఆలయాధికారులు చోద్యం వహిస్తున్నారని, వారిపై కూడా దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ సీజ్



నార్సింగి పీఎస్‌లో టిప్పర్

చేగుంట/మనోహరాబాద్, జూలై 10: నార్సింగి మండల పరిధి జప్తిశివనూర్ గ్రామ శివారులోని అమ్మకుంట నుంచి మట్టి అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు బుధవారం పట్టుకొని సీజ్ చేశారు. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మొహినోద్దీన్ మాట్లాడుతూ గ్రామ శివారులోని అమ్మకుంటలో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారన్న సమాచారం మేరకు.. అక్కడికి వెళ్లి టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టి రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మనోహరాబాద్‌లో మట్టి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి శివారులో మంగళవారం రాత్రి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ హెచ్చరించారు.

రేపు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూలై 10: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో ఈనెల 12న ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-25 జట్టు క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెలలో జరగనున్న హెచ్‌సీఏ బీ1 డివిజన్ టుడే లీగ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికేట్, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డుతో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని ఆయన సూచించారు.

'అగ్నివీర్ వాయు' నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం



నీల చంద్రం

రాయపోల్, జూలై 10: భారత వాయుసేనలో 'అగ్నివీర్'గా పనిచేసేందుకు అవివాహితులైన అభ్యర్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు తీసుకోవడం ప్రారంభించిందని రిటైర్డ్ ఆర్మీ జవాన్, గజ్వేల్ ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నీల చంద్రం పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చంద్రం సూచించారు.

గ్రానైట్ షాపులో దొంగతనం

● స్మార్ట్ టీవీతో పాటు నగదు అపహరణ

రామాయంపేట, జూలై 10: పట్టణంలోని ఓ గ్రానైట్ షాపులో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. వెనుక డోర్ బద్దలు కొట్టి చొరబడ్డ దొంగ గల్లా పెట్టెలోని కొంత నగదుతో పాటు స్మార్ట్ టీవీ, కొన్ని కరెంట్ వైర్లను ఎత్తుకెళ్లాడు. బుధవారం షాప్ తెరిచిన యజమాని సాగర్ దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





శివ్వంపేట మండలం నవాబ్ పేట్ గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న రైతు శ్రీనివాసరెడ్డి చెందిన పత్తి పంట

వర్షాలు లేక ఎండుతున్న పత్తి పంట

● పెట్టుబడి కూడా రాదేమోనని ఆందోళన చెందుతున్న రైతులు

శివ్వంపేట, జూలై 10: వర్షాకాలం ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పైగా ఖరీఫ్ సీజన్ కూడా ఇంకా కొద్దిరోజులు గడిస్తే పూర్తవుతుండడంతో వరుణ దేవుని కరుణ కోసం గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. పునర్వసు కార్తెలో కూడా వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వర్షాల జాడ లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి వస్తుందో.. రాదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో నవాబ్‌పేట్ గ్రామంలో రైతులు నల్ల రేగడు భూముల్లో ఎక్కువశాతం పత్తి పంట సాగుచేస్తున్నారు. గ్రామంలో వందకు పైగా ఎకరాల్లో పత్తి సాగుచేశారు. పంట వేసి నెలకు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో వేసిన పత్తి పంట ఎండుముఖం పడుతుందని రైతులు ఏనుగు పద్మారెడ్డి, చిన్న నర్సారెడ్డి, సయ్యద్ బాబాలు ఆవదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండురోజుల్లో వర్షాలు కురవకుంటే పత్తి పంట పూర్తిగా ఎండిపోతుందని బోరు బావుల్లో కూడా నీటిమట్టం తగ్గడంతో పంటకు నీరు అందడం లేదని వాపోతున్నారు.

కేంద్ర వాణిజ్య శాఖ పేటెంట్ అధికారిగా రాథోడ్ రామేశ్వర్



తల్లిదండ్రులతో రాథోడ్ రామేశ్వర్

కంగ్టి, జూలై 10: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బోర్గి తండాకు చెందిన రాథోడ్ రామేశ్వర్ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖలో పేటెంట్ అధికారిగా ఉద్యోగం సాధించారు. అంతకు ముందు పలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఆయన తాజాగా జాతీయ స్థాయిలో ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షలో 380వ ర్యాంకు సాధించి ఈ ఉద్యోగాన్ని దక్కించుకున్నారు. తండాలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఫుల్‌సింగ్, సుమన్‌బాయి దంపతుల కుమారుడైన రామేశ్వర్ నారాయణఖేడ్‌లోని ఆశ్రమ పాఠశాలలో అయిదవ తరగతి వరకు, పదవ తరగతి వరకు నల్లవాగు గురుకుల పాఠశాలలో చదివారు. బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బయోమెడికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇదే సమయంలో గ్రామపంచాయతీ కార్యదర్శుల నియామక పరీక్షలకు హాజరైన రామేశ్వర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై సిర్గాపూర్ మండలంలోని వంగ్దల్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా 10 మాసాల పాటు పని చేశాడు. కానిస్టేబుల్ నియామకాలకు జరిగిన పరీక్షల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. కందిలోని ఐఐటీలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఎన్‌టీఏ పరీక్ష రాసి జాతీయ స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. అంచెలంచెలుగా ఎదిగిన రామేశ్వర్‌ను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా సర్కారు బడులు

- తరగతి గదుల్లో డిజిటల్ బోర్డుల ఏర్పాటు
- విద్యార్థుల్లో ఉత్సాహం



అల్లాదుర్గంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోర్డు ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

అల్లాదుర్గం, జూలై 10: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ పనులు చేపట్టింది. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాఠశాలలోని పాత కాలం నాటి బోర్డు (చెక్క) స్థానంలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తూ విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ చూపుతోంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఈ డిజిటల్ బోర్డులో భాగంగా మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని జిల్లా పరిషత్ (బాలికల)ఉన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటు చేసింది. ఈ డిజిటల్ బోర్డుతో ఎటువంటి చాక్‌పీస్, ఇంకును వాడకుండా బోర్డుపై రాస్తూ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలను సులభతరంగా అర్థమయ్యే విధంగా, క్యూఆర్ కోడ్ ద్వారా వీడియో పాఠాలను బోధించవచ్చునని, పాఠాలను రికార్డు చేసి ఉపాధ్యాయులు లేని సమయంలోనూ ఈ పాఠశాల బోధించవచ్చునని ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. పాఠ్యాంశాలతో పాటు టూడీ, త్రీడీ చిత్రాలను విద్యార్థులకు సులభతరంగా వివరించవచ్చునని వారు తెలిపారు.

ఈ బోర్డుతో ఎన్నో ప్రయోజనాలు

విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేసేందుకు వీలుగా ఉన్న ఈ డిజిటల్ బోర్డు విద్యార్థులకు మరెన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది. విద్యార్థులు పీడీఎఫ్ ద్వారా టెస్ట్ బుక్స్‌ను చూసే వీలుండగా, గణితం టూల్స్ ద్వారా గణిత పటములను గీయవచ్చునని, సామాన్యశాస్త్రానికి సంబంధించిన ప్రయోగాలను కూడా వీడియోలు తిలకించి నేర్చుకోవచ్చునని, ప్రభుత్వం నిర్వహించే లైవ్ కార్యక్రమాలను తిలకించవచ్చునని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. డిజిటల్ బోర్డుల ఏర్పాటుతో విద్యార్థుల్లో ఉత్సాహం మరింత పెరిగిందని, దీంతో పరీక్షా ఫలితాల్లోను చక్కటి ఉత్తీర్ణత ఫలితాలు వస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు బావిస్తున్నారు.



పాఠాలను శ్రద్ధతో వింటున్న విద్యార్థులు

అర్థమయ్యే విధానంతో బోధన



డిజిటల్ బోర్డు ద్వారా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధిస్తుండటంతో సులభంగా అర్థమవుతుంది. టూడీ, త్రీడీ చిత్రాలను బోర్డు ద్వారా తిలకిస్తుండటంతో తమకు ఎంతో దోహదపడుతుంది. గతంలో జరిగిన పాఠ్యాంశాలను తిరిగి వినేందుకు ఉపయోగకరంగా ఉంది.

- రేణుకా, 10వ తరగతి విద్యార్థిని

చక్కటి ఉత్తీర్ణత ఫలితాలు వస్తాయి



డిజిటల్ బోర్డు ఏర్పటుతో తమలో నైపుణ్యం పెంచేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తుండడంతో పరీక్షా ఫలితాల్లో చక్కటి ఫలితాలు లభిస్తాయి. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు ప్రతీ ఒక్కటి చాలా అవగాహన కలిగిస్తున్నాయి.

- అరవింద్, 10వ తరగతి విద్యార్థి

కార్మికుల కనీస వేతనాన్ని పెంచాలి



జహీరాబాద్‌లోని తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

కార్మికుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆయా మండలాల్లోని తహసీల్ కార్యాలయాల్లో అధికారులకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, పారిశుధ్య, పారిశ్రామిక కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్, జూలై 10: అన్నిరంగాల కార్మికులకు కనీసవేతనాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్ పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని బుధవారం తహసీల్దార్ కార్యాలయంవద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇవ్వడంతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26వేల చొప్పున అందజేయాలన్నారు. కేంద్రం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో వివిధరంగాల కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

● **కోహీర్:** రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు గురువారం కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లకు తక్షణమే కనీస వేతనం అమలు చేసి అర్హులైన ప్రతీ ఆశ వర్కర్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశాలు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

● **ఝరాసంగం:** ఝరాసంగంలోని తహసీల్దార్ కార్యలయం ఎదుట ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి చంద్రన్న మాట్లాడుతూ కార్మికులకు నెలకు కనీసం రూ. 26 వేల వేతనంతో పాటు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



జిన్నారం: కాజీపల్లి పారిశ్రామికవాడలో కార్మిక సమస్యలపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

● **మునిపల్లి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ తెన్మొళికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నగేష్ కుమార్, గోపాల్, లక్ష్మి, విజయలక్ష్మి, వెంకటమ్మ, మీనాక్షి, వీరమణి, విజయలక్ష్మి, లలిత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

● **జిన్నారం:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బుధవారం కాజీపల్లి పారిశ్రామికవాడ, బొల్లారం మున్సిపల్ కార్యాలయం వద్ద పరిశ్రమల కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులతో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన జరిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ రావు, వెంకటేశ్, నర్సింహగౌడ్, భాస్కర్‌రెడ్డి, శేఖర్, సురేందర్‌రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

● **కల్హేర్:** అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచి, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సిర్గాపూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** అంగన్‌వాడీ టీచర్లు, పురపాలక కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ నారాయణఖేడ్ డివిజన్ సీఐటీయూ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేకవిధానాలను నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, పురపాలక కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ భాస్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, పురపాలక కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శివ్వంపేట: డిప్యూటీ తహసీల్దార్‌కువినతి పత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఆశ వర్కర్లు

● **హత్నూర:** తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఆయాలు హత్నూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకురాలు మంగ డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

● **గుమ్మడిదల:** బొంతపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో పని చేస్తున్న ప్రతీ కార్మికునికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల నాయకుడు శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం బొంతపల్లి పారిశ్రామికవాడలోని న్యూల్యాండ్ పరిశ్రమ సీఐటీయూ జెండా వద్ద కార్మికులు ప్లకార్డ్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటేష్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ నరసింహగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** గ్రామాల్లో వెట్టిచాకిరి చేస్తున్న అశావర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ చిన్నశంకరంపేట తహసీల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్ధార్ మన్నన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్, అజయ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే చెల్లించాలని మిర్జాపల్లి హైస్కూల్ మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం తహసీల్దార్ మన్నన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గత ఎనిమిది నెలల నుంచి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


తూప్రాన్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

● **కొల్చారం:** ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ నాయకులు సబిత, రాములమ్మ, కవిత డిమాండ్ చేశారు. కొల్చారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రమేష్‌కు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● **శివ్వంపేట:** కార్మికుల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శివ్వంపేటలో మండల పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్ కు పారిశుధ్య కార్మికులు, ఆశ వర్కర్లు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, బాలకృష్ణ, భాస్కర్, కృష్ణ, వసంత, ఆశ వర్కర్లు గోపమ్మ, రేణుక, మాధవి తదితరులు ఉన్నారు.

● **తూప్రాన్:** అన్ని రంగాల కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో జయచంద్రారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్మికులకు సమస్యలకు సంబంధించిన 24 డిమాండ్ల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించినవారిలో సీఐటీయూ నాయకులు యాదగిరి, స్వామి, మహేశ్, సరిత, మల్లమ్మ పాల్గొన్నారు.

● **మాసాయిపేట:** పని గంటలకు తగిన వేతనం చెల్లించాలని 73 వ షెడ్యూల్ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు కిషన్ ఆధ్వర్యంలో కార్మికులు మంజుల, నర్సింహులు, నాగరాజు గ్రామపంచాయతీ కార్మికులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఘటనాస్థలంలో వివరాలను సేకరిస్తున్న పోలీసులు, మృతుడు రమేష్(ఫైల్)

పెద్దశంకరంపేట, జూలై 10: పెద్దశంకరంపేట మండలం కోలపల్లి శివారులోని 161వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి తండాకు చెందిన వడ్త్యా రమేష్(28) తన ద్విచక్ర వాహనంపై పెద్ద శంకరంపేటకు బయలుదేరాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్‌కు అతివేగంగా వెళ్తున్న కారు బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ విఠల్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

చెరువులో పడి యువకుడు..


మృతిచెందిన లక్ష్మయ్య

చేగుంట, జూలై 10: పక్షుల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారు చెరువులో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల మేరకు ఏపీలోని నెల్లూరు జిల్లా కావలి మండలం మన్నెం దిగిన్నె గ్రామానికి చెందిన చోటురు లక్ష్మయ్య(19) 20 రోజుల క్రితం చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీలో నివాసముంటున్న అక్క శేషమ్మ వద్దకు వచ్చాడు. మంగళవారం రాత్రి గ్రామ శివారులోని బతుకమ్మ చెరువులో పక్షుల వేటకు వెళ్లిన లక్ష్మయ్య ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

● శివ్వంపేట కేజీబీవీ పాఠశాలను సందర్శించిన ఓపెన్ స్కూల్ డైరెక్టర్

శివ్వంపేట, జూలై 10: విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించాలని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ సోమిరెడ్డి కేజీబీవీ పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రమైన శివ్వంపేట కస్తూర్బా గాంధీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. సైన్స్ ల్యాబ్‌ను ఉపయోగించి విద్యాబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో బుచ్చినాయక్, సీఆర్పీ రవీందర్ పాల్గొన్నారు.

శిఖం భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

హత్నూర, జూలై 10: శిఖం భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఫర్హీన్ షేక్ అన్నారు. బుధవారం హత్నూర గ్రామానికి చెందిన స్థానిక నాయకులు తహసీల్దార్‌ను కలిసి పెద్ద చెరువు, అల్వాయి చెరువు తాలింపు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయని ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన తహసీల్దార్ శిఖం భూములను పరిశీలించారు. ఎవరైనా శిఖం భూములను కబ్జా చేసి పంట సాగు చేస్తే కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. త్వరలోనే అన్ని చెరువుల శిఖం భూములను సర్వే చేయిస్తామన్నారు.

వ్యాపార సముదాయాల్లో కార్మిక శాఖ అధికారుల తనిఖీలు

జిన్నారం, జూలై 10: బొల్లారం మున్సిపాలిటీలో పలు వ్యాపార సముదాయాలలో కార్మికశాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం మున్సిపాలిటీలోని పలు దుకాణాల్లో తనిఖీలు జరిపిన అధికారులు ఓ దుకాణంలో మైనర్ బాలుడి చేత పని చేయిస్తుండగా గుర్తించి, యజమానిని హెచ్చరించి, కేసు నమోదు చేశారు.

సంగారెడ్డిలో జాతీయ ఫిష్ డే

సంగారెడ్డి రూరల్, జులై 10 : జాతీయ ఫిషర్స్ డే వేడుకలను బుధవారం మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, మత్స్య సహకారసంఘం అధ్యక్షుడు నగేష్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని మత్స్య సహకార సంఘం చేపల మార్కెట్‌లో భారీ చేపలను వినియోగదారులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారాజు, కార్యదర్శి చిదంబర సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి: ఎస్ఐ

చిన్నశంకరంపేట, జూలై 10: విద్యార్థులు బాల్యం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నారాయణగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో బుధవారం షీ టీం కళాబృందం ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. చెడువ్యసనాలకు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రుప్లా నాయక్, ఉపాధ్యాయులు, షీ టీం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టేక్మాల్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

టేక్మాల్, జూలై 10: మండల కేంద్రంలోని టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీవో రియాజుద్దీన్, పంచాయతీ ఈవో కమలాబాయి ఆధ్వర్యంలో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సంగారెడ్డి రూరల్, జులై 10: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ముందు పీడీఎస్‌యూ అధ్వర్యంలో బుధవారం విద్యార్థులు ధర్నా చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు వంశీ, సిద్దేశ్వర్, బన్నీ, దుర్గాప్రసాద్, శివ, సాయి పాల్గొన్నారు.

పోతంశెట్‌పల్లి అంగన్‌వాడీలో పిల్లలకు అన్నప్రాసన

కొల్చారం, జూలై 10: మండలంలోని పోతంశెట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ బుధవారం అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి ఆరు నెలల పాటు తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డకు 6 నెలలు నిండిన తర్వాత అనుబంధం ఆహార అవసరంపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో నేడు విద్యుత్ అంతరాయం

పటాన్‌చెరు, జూలై 10: మరమ్మతుల కోసం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. 11కేవీ అమీన్‌పూర్ ఫీడర్, 11కేవీ లక్ష్మీహోమ్స్ ఫీడర్ పరిధిలోని అమీన్‌పూర్ గ్రామం, ఎంఎస్‌హోమ్స్, టీచర్స్‌కాలనీ, పద్మావతి హోమ్స్, సత్యకృప, శ్రీనివాస్‌హోమ్స్, మోడీ బిల్డర్స్, త్రిపుర, లింమయ్యకాలనీ, భవానిపురం పరిధిలో ఉదయం 11 నుంచి 11-30వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11కేవీ వెదిరికాలనీ, పీఎస్‌ఆర్‌హిల్స్ ఫీడర్ల పరిధిలోని అమీన్‌పూర్ గ్రామంలోని కొంతభాగం, సాయిరాజేశ్వరి, చక్రపురి, ప్రైడ్‌పార్క్, శ్రీవాణీనగర్, సబ్‌వే హోమ్స్, ఎంపైర్‌మిడోస్, వెదిరిటౌన్‌షిప్‌ల పరిధిలో 11-30 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. బందంకొమ్ము, మారుతీహిల్స్, కృష్ణబృందావన్‌కాలనీ, మైత్రీకాలనీలలో 12నుంచి 12-30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కేజీఆర్, సాయివిల్లాస్, ఎంఎస్.హోమ్స్, భరత్‌నగర్ కాలనీలలో 12-30నుంచి 1గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిని కలిసిన రాజుగౌడ్



సంగారెడ్డి అర్బన్, జూలై 10 : బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్ బుధవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు ద్వివేదిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఆయనను సన్మానించారు. జిల్లాలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గట్టిపోటీ ఇవ్వాలని, అదే విధంగా వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు డా.రాజుగౌడ్ తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత

నారాయణఖేడ్, జూలై 10: ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బుధవారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోను ఆమె సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. డిపోకు వస్తున్న ఆదాయంపై డీఎం మల్లేశంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రయాణికులు ఎక్కడ చేయి చూపితే అక్కడ బస్సును ఆపాలని సూచించారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని తమిళనాడులోని అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నందున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ అధికారులు, కార్మికులు, సిబ్బంది ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిపో సహాయ మేనేజరు నర్సింహులు, సహాయ మెకానికల్ ఇంజనీర్ దశరథ్‌రావు, ఎస్టీఐ నందులాల్, సూపరింటెండెంట్ ప్రవీణ్, పీఆర్వో పాండు తదితరులు ఉన్నారు.

బెంబేలెత్తిస్తున్న మట్టి తరలింపు వాహనాలు

● అర్ధరాత్రి అడ్డుకున్న గుమ్మడిదల గ్రామస్థులు


కానుకుంట చౌరస్తాలో మట్టి టిప్పర్ లారీలను అడ్డుకుంటున్న అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు

గుమ్మడిదల, జులై 10: గత కొన్ని రోజులుగా నర్సాపూర్ వైపు నుంచి గుమ్మడిదల మీదుగా అతివేగంగా తోలుతూ, నల్ల మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, లారీలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా మట్టి వాహనాలను జోరుగా నడిపిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పలువురు మండిపడుతున్నారు. మట్టి తరలింపు లారీల తీరుపై ఆగ్రహించిన స్వచ్ఛంద సంఘాలవారు, అంబేద్కర్ యువజన సంఘాల సభ్యులు మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో గుమ్మడిదల గ్రామంలోని కానుకుంట చౌరస్తా వద్ద మట్టి లారీలను అడ్డుకున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోడ్డుపై నిరసన తెలిపారు. ఇటీవలే గుమ్మడిదల గ్రామానికి చెందిన సంజీవరెడ్డి అనే రైతును మట్టి టిప్పర్ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన చోటు చేసుకుని వారం కూడా గడవక ముందే మళ్లీ మట్టి తరలింపు వాహనాలను వేగంగా నడిపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోటాపోటీగా వేల సంఖ్యలో ట్రిప్పులను వాహనాల్లో నల్లమట్టిని తరలించడం. డ్రైవర్లకు విశ్రాంతి ఇవ్వకపోవడం కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా మట్టి టిప్పర్లను కట్టడి చేయలేకపోతున్నారంటూఅసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండల అధికారులు చర్యలు తీసుకోకుంటే కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రేపు సంగారెడ్డిలో జాబ్‌మేళా

సంగారెడ్డి రూరల్, జూలై 10: సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగులకు ఈ నెల 12న ఉదయం 11 గంటలకు బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు కార్యాలయం ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కల్పన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 25 యేళ్ల వరకు ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన వారి డీమార్ట్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 08455-271010 నంబర్‌లో సంప్రదించాలని వందన కోరారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి


కోహీర్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మండల బీజేపీ నాయకులు

టేక్మాల్, జూలై 10: రైతుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో టేక్మాల్ డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడాన్ని బీజేపీ కిసాన్ మోర్చా తీవ్రంగా నిరసిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోకి కట్టుబడి రైతు భరోసా పేరుతో సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు రైతు భరోసా పథకం ద్వారా ఖరీఫ్, రబీ కలుపుకొని రూ.15వేల ఆర్థిక తోడ్పాటును అందించాలని, కౌలు రైతులకు సైతం ఆర్థిక సహకారం అందించాలని, వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రధానమంత్రి పంటల బీమా యోజనను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ది రాములు, మండల నాయకులు పాల్గొన్నారు.

● **వట్‌పల్లి:** కాంగ్రెస్ ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకాన్ని తక్షణమే అమలు చేసి రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు బుధవారం వట్‌పల్లి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, అందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్ మండల ఉపాధ్యక్షుడు సురేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● **కోహీర్:** అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రమైన కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల బీజేపీ నాయకులు నిరసన తెలిపి తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగరాజ్, కిష్టయ్య, రమేష్, తదితరులు ఉన్నారు.

రైతు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

సంగారెడ్డి అర్బన్, జూలై 10: రైతుల సమస్యలపై సంగారెడ్డిలో ఈ నెల 11న తలపెట్టిన రైతు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి కోరారు. సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ దీక్షకు ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలివచ్చి దీక్షను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయ్, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి, ఉపాధ్యక్షుడు నాగరాజు, రాజేందర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు


బదిలీపై వెళ్తున్న జగన్‌లాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చేగుంట, జూలై 10: మండలంలోని చిన్నశివనూర్ పాఠశాలలో పని చేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు జగన్‌లాల్ కరీంనగర్ గ్రామ హైస్కూల్‌కు పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. బుధవారం తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువా, పూలమాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, రాజశేఖర్‌రెడ్డి, చక్రధర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం జడ్పీహెచ్ఎస్‌లో..


అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

అల్లాదుర్గం, జూలై 10 : అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొన్నేళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు స్వప్న, నవనీత, శ్రీవిద్య, హేమలత, మురళీ తదితర ఉపాధ్యాయులకు బుధవారం తోటి ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సత్కరించారు. పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు స్వప్న, సత్యనారాయణ, ప్రదీప్‌రెడ్డిలను సైతం సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం ధనుంజయగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పాల్గొన్నారు.

రామంతపూర్‌లో..


బదిలీ అయినవారిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది

వెల్దుర్తి... మాసాయిపేట, జూలై 10: మండలంలోని రామంతపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రజితారెడ్డి, సాయిలతను పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ధర్మపురి, ఉపాధ్యాయ సంఘం నాయకులు రంగారెడ్డి శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎంపీడీవో

శివ్వంపేట, జూలై 10: మండలంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో నాగేశ్వర్ ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా మండల పరిధిలో దొంతి వైకుంఠధామంలో బుధవారం 800 మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కార్యదర్శి శంకర్ గౌడ్, మెట్ లు యాదగిరి, జ్యోతి ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

'మడూర్‌లో వైన్స్ షాపు నిలిపివేయాలి'

చిన్నశంకరంపేట, జూలై 10: మండలంలోని మడూర్ గ్రామ శివారులో మద్యం వైన్స్ షాపు ఏర్పాటు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు అనుమతినివ్వడంతో ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. గ్రామానికి దగ్గరగా మద్యం షాపు ఉండడంతో పాటు పాఠశాల విద్యార్థులు, ఆలయాల వద్దకు వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. వెంటనే దుకాణం ఏర్పాటు పనులను నిలివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు తీర్మానించారు. వైన్స్ రద్దు చేయాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మహంకాళి ఉత్సవాలు

తూప్రాన్, జూలై10: తూప్రాన్‌లో ఈనెల 28 నుంచి శ్రీఉజ్జయిని మహంకాళి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మున్సిపల్‌లో తీర్మానించారు. బుధవారం చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు.